ఇల్లీగల్

-వైశాలి అండ్ డి. ఆర్. ఇంద్ర

రాస్కెల్! భడవ!

భళ్ళున తలుపులు తోసుకుని లోపలికి దూసుకువచ్చేశాడు కాలింగ్‌బెల్ వున్నా నొక్కకుండా. వచ్చినవాడు వచ్చినట్టూరుకున్నాడా?

కైలాసంలో పార్వతీపరమేశ్వరులు మంచి రసకందాయంలో వుండగా సిగ్గు లేకుండా ఎదురుగా నిలబడ్డ మానర్స్‌లెస్ అగ్నిదేవుడిలా సింహాద్రి ఆ జంటని అలాగే గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు. అక్కడికి వాళ్ళేదో వాత్స్యాయనుడు సైతం కని పెట్టని కొత్త భంగిమలో వున్నట్టు!

ఆ సమయంలో రాంబాబు కేన్‌కుర్చీలో కూర్చునివున్నాడు. లలిత అతని వళ్ళో కూర్చున్నట్టు అనుకుని కింద కూర్చుని 'న్యూఉమన్' మాగజైన్ తిరగేస్తోంది. అప్పటికే రాంబాబు లలితకి ఒక జడ వెయ్యడం పూర్తిచేసి. దువ్వెన పళ్ళమధ్య కరచిపెట్టి రెండో జడ పాయలు తీస్తున్నాడు.

"రావోయ్ సింహాద్రీ!" అంది లలిత నవ్వుతూ.

దువ్వెన నోట్లో వుండటంవల్ల మాట్లాడలేక కళ్ళతోటే 'కూర్చోవోయ్ బ్రహ్మచారీ!' అన్నట్టు సైగచేశాడు రాంబాబు.

"రాకూడని సమయంలో వచ్చినట్టున్నాను ... " అంటూ కూర్చున్నాడు సింహాద్రి. అతని చేతిలో ఏదో కవర్ల కట్ట వుంది చివర్ల దట్టంగా పసుపురాసి. తలలో పేనుని వెదికిపట్టినట్టు సింహాద్రి కట్టలోంచి ఓ కవరు వెదికితీసి లలిత చేతిలో పెట్టాడు.

అది సింహాద్రి పెళ్ళి శుభలేఖ. లలిత కవరు విప్పింది.

షరా మామూలే అన్నట్టు తొంభైతొమ్మిదిశాతం పెళ్ళి శుభలేఖలు ఎలా వుంటాయో అదీ అలాగే వుంది.

శ్రీరస్తు ... శుభమస్తు ... అవిఘ్నమస్తు ... జానక్యాః కమలాం పద్యం. తిథీ ... వారం ... సుముహూర్తం ... తెల్లవారితే శనివారం ... (తెల్లవారకపోతే? భలే! ఎప్పటికీ తెల్లారని ఆ తెల్లారగట్ల చెవులు దిబ్బళ్ళుగొట్టే బేండ్ మేళాన్నీ, పట్టుచీరల్నీ, పిలకల్నీ పందిట్లో వదిలేసి ఊరికి దూరంగాపోయి కాలవగట్టమ్మట సన్నగా కురుస్తున్న మంచులో తడుస్తూ తనూ, రాంబాబూ ఒకరి నడుం చుట్టూ మరొకరు చేతులు బిగించుకుని నక్షత్రాల వెలుగులో నడుచుకుంటూపోతుంటే ... ఓహ్! ఎంత అద్భుతం!) ... బంధుమిత్ర సపరివారసమేతంగా విచ్చేసి ... మదర్పిత చందనతాంబూలాది సత్కారాలు గైకొని మంగళం మహత్ ... ఐదు శ్రీలు.

కొంగలా మెడ ముందుకి చాపిన రాముడిమెడలో పూలదండ వేస్తున్న సీత బొమ్మ చిత్రంచూసి నవ్వింది లలిత.



"ఏమోయ్ సింహం! పెళ్ళిశుభలేఖల మీద అచ్చేయడానికి ఈ దంపతులు తప్ప మరెవరూ కనిపించరా నీ కంటికి? అనుమానపు మొగుడూ, ఆత్మాభిమానంలేని పెళ్ళాం! ఏడుపులూ, ఛీత్కారాలు, అగ్నిపరీక్షలూ, విడిచిపెట్టెయ్యడాలూ! ఇంత అసహ్యకరమైన భాగోతం జరిపిన ఈ జంటేనా మీ కాబోయే దంపతులకి ఆదర్శంగా వుండాల్సింది?"

"రామ! రామ! ఎంతమాట అనేస్తారు లలితగారు!" అంటూ లెంపలేసుకున్నాడు సింహాద్రి.

"ఇంతకీ ఎంతకి అమ్ముడుబోయావ్ సింహం?"

"ఛ! ఆ మాటేవిట్నండీ లలితగారూ? మావాళ్ళు అడక్కుండానే వాళ్ళే లక్ష కేషూ, స్కూటరూ, గోల్డ్ రిస్ట్‌వాచీ, పదేసివేలు ఆడబడుచు లాంఛనాలూ ఇస్తామన్నారు. అయినా ఇందులో మాకేమైనా మిగుల్తుందనుకుంటున్నారా? ఆ పిల్లకి నగలుపెట్టడానికీ, పెళ్ళిఖర్చుకే బొటాబొటీగా సరిపోతుందండి. కట్నాలంటే మీకెందుకండీ అంత కోపం? మొగపెళ్ళివారికి కట్నకానుకలిచ్చి సంతోషపెట్టడం మన సంప్రదాయంలో అదో వేడుక."

"వేడుకా ... గాడిదగుడ్డా? కట్నాలివ్వడం, పుచ్చుకోవడం సిగ్గులేనితనానికి పరాకాష్ట..."

లలితా, సింహాద్రీ వాదించుకుంటుంటే లలిత రెండోజడ వెయ్యడం పూర్తిచేసిన రాంబాబు లేచి టీకాచి పట్టావడానికి వెళ్ళాడు.

సింహాద్రిని చూస్తే రాంబాబుకి అభిమానం. ప్రతీ ఆదివారం పొద్దుటే వచ్చి కూర్చుంటాడు. లలితతో వాదిస్తూ పోట్లాటపెట్టుకోవడం సింహాద్రికి ఇష్టం. కానీ వాదనలో లలితను గెలవలేడు. లలితపెట్టే చురకలను వూదుకుంటూగానీ వెళ్ళడు. అయినాసరే రావడం మానడు.

సింహాద్రి లలితతోటీ, తనతోటీ పోట్లాటపెట్టుకోడానికి అతని దృష్టిలో తగిన కారణమే వుంది. సింహాద్రి దృష్టిలో తామిద్దరూ వివాహితులుకారు. పందిట్లో బాజాభజంత్రీలగోలలో, పరాయిభాషలో బాహ్మడు ఏదో గొణుగుతుండగా, పట్టుచీరలు లలిత పువ్వులజడ ఎత్తిపట్టుకోగా లలిత మెడలో తాను తాళికట్టలేదు. అందుకే సింహాద్రి దృష్టిలో తామిద్దరూ పెళ్ళీ పెటాకులూ ఏమీలేకుండా కాపురం పెట్టేసిన బాపతు.

పెళ్ళిళ్ళలో జరిగే తంతు అంతా మతాచారాలకి సంబంధించినదని భావించడం వల్ల కులం, మతం, వాటి తంతులు ఏమీలేకుండా బతికే లలితా, తనూ అలా సంప్రదాయబద్ధంగా పెళ్ళిచేసుకోలేదు. చాలా సింపుల్! లలితే ఓరోజు నలుగురు స్నేహితుల్నీ పిలిచి 'ఈరోజు నుండీ మేం భార్యాభర్తలమోచ్' అన్చెప్పేసింది. 'జినోచ్' అన్నట్టు తనూ లలిత చెయ్యిపట్టుకుని తలూపాడు.

అంతే! నోటిమీద, ముక్కుమీద వేళ్ళేసుకునేవాళ్ళు వేసుకున్నారు.

మెడలో మంగళసూత్రాలూ, నల్లపూసలూ, కాళ్ళవేళ్ళకి మట్టెలూ, నుదుట బొట్టూ, చేతులకు గాజులూ గట్రా ఏమీ లేని లలితనీ, వెనకనిలబడ్డ తననీ చూసి గృహయజమానులు "ఇళ్ళి సంసార్లకి ఇచ్చేపోర్షన్లు - మీరు దయచేయచ్చు!" అనేవారు వెటకారంగా.

తమ జంటని అలా అందరూ 'బయటకు దయచేయండి' అనడం సింహాద్రికి చాలా సంతోషాన్నిచ్చింది.

"చూశారా లలితగారూ! ఆడదానిమెడలో తాళి లేకపోవడం ఎంత నష్టమో! రాంబాబుగారూ! ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. నామాటవిని ఇప్పడైనా లలితగారి మెడలో కాస్త పుస్తెముడెయ్యండి. అద్దెఇల్లు ఎందుకు దొరకదో చూద్దాం" అనేవాడు.

లలిత నవ్వేది.

"నా మెడలో పుస్తెలతాడు లేకపోతే లోకానికి కడుపునొప్పి ఎందుకటా? ఆడదానికి పెళ్ళయినట్టు గుర్తుగా మెడలో పుస్తెలతాడు వుంటే - మగాడికి పెళ్ళయిన గుర్తుగా అతగాడి మెడలోనూ ఓ మూర్ఖబిళ్ళలాటిదొకటి వుండొద్దా? అటువంటి బిళ్ళలు మగాళ్ళకే అవసరం ఆడవాళ్ళ క్షేమందృష్ట్యా. పెళ్ళయి పిల్లలున్నా, ఇంకా అవలేదని చెప్పి పెళ్ళిమీద పెళ్ళి చేసుకుంటూ ఆడవాళ్ళని మోసగించేది మగాళ్ళే. అటువంటి మోసాలకి అవకాశంలేకుండా ఫలానా అతనికి పెళ్ళయిందని నలుగురికీ తెలిసేటట్టు 'మేరీడ్' అనే ముద్ర ఒకటి కాల్చి మొగాళ్ళ నుదుటున వాతపెడితే బావుంటుందంటాను. ఏమంటావ్ సింహం?" అంటుంది లలిత.

సింహాద్రి ఉడుక్కుంటాడు.

"మీ గురించి బయట జనాలు ఎంత అసహ్యంగా చెప్పుకుంటారో తెలుసా లలితగారూ! మీ స్నేహితుడ్ని అయినందుకు విన్లేక సిగ్గుతో ఛస్తున్నాను" అంటాడు.

"లోకులు పలుకాకులు సింహం! ఆ కాకుల్ని అలాగే అరవనీ. నోరెండి అవే వూరుకుంటాయ్. నువ్వు భరించలేకపోతే మా స్నేహం నిరభ్యంతరంగా మానేయొచ్చు.

"అసలు పెళ్ళీ పెటాకుల్లేకుండా మీరిలా కలిసి కాపురం చెయ్యడం ఇల్లీగల్ తెల్సా లలితగారూ?" "పోనీ, లీగల్ ఏమిటో చెప్ప సింహం."

"అయితే వినండి. ఓ ఆడదీ, ఓ మొగాడూ కల్సి కాపురం చెయ్యాలంటే సమాజం ఆమోదించే సంప్రదాయపు తంతుకి ఎవ్వరైనాసరే కట్టుబడి వుండాల్సిందే లలితగారూ. చక్కగా బంధుమిత్రుల సమక్షంలో, పెద్దలు నిర్ణయించిన సుముహూర్తంలో మంగళవాయిద్యాలూ-మంత్రోచ్ఛారణల మధ్య పెళ్ళికూతురిమెడలో వరుడు తాళికట్టడం, ఏడడుగులు కలిసి నడవడం, నాతిచరామి అని ప్రమాణాలు చెయ్యడం, పెద్దల ఆశీస్సులు పొందడం ఎంత గొప్ప అనుభూతండీ! ఆ సంప్రదాయపు కట్టుబాట్లూ, ఆ పవిత్రతా, వాటి సెంటిమెంట్లూ ఆ జంటని జన్మంతా ఒకటిగా కలిపివుంచవటండీ? అవేమీ లేకుండా మీలాటివాళ్ళు ఇలా కాపురాలు పెట్టేయడం అనైతికం. ఇలాటి కాపురాలు ఎన్నాళ్ళు నిలుస్తాయ్? ఆర్రోజులా-ఆర్నెల్లా? కోపతాపాలొస్తే ఎవరి బాగ్ వాళ్ళు సర్దుకుని తలోదారీ పోతారు కాబోలు! మీరెంతకాలం కలిసి కాపురం

చేస్తారో నే చూడనూ?"

"మహాబాగా చూడు సింహం. మరో నాలుగుకళ్ళు అరువుతెచ్చుకుని అతికించుకుని చూడు" అంటుంది లలిత.

వాళ్ళ పోట్లాటకు అంతుండదు. రాంబాబు టీ కప్పుల్లో పోసి ట్రేతో డ్రాయింగ్‌రూంలోకి నడిచాడు.

"... ఇలా అడుగుతున్నానని మరోలా అనుకోకండి లలితగారూ. మీ ఇద్దర్లో మీరే పెద్దగా అనిపిస్తారు, నిజమేనా?" అడుగుతున్నాడు సింహాద్రి.

"నిజమే. రాంబాబుకన్నా నేనే మూడేళ్ళు పెద్ద. అయితే ఏమిటట?"

"... ఆడది పెద్దదైతే ... ఆ మొగాడికి ఆయుక్షీణమంటారు పెద్దలు!"

"వాళ్ళ బొందేం కాదూ? వెధవ తిరుగుళ్ళు తిరగడానికి అడ్డురాని వయసు దంపతులవడానికి అడ్డొస్తుందా? అసలు సంసారంలో ఆడదే పెద్దదైతే చాలా లాభాలున్నాయ్! విను సింహం. తనకన్నా చిన్నదైన పెళ్ళాంమీద జులుం చెలాయించినట్టు తనకన్నా పెద్దదైన పెళ్ళాం మీద మొగాడు జులుం చెలాయించలేడు. బుద్ధిగా ఒద్దిగ్గా కాపురం చేసుకుంటాడు. మొగాడు పిచ్చివేషాలేస్తే పెద్దదైన పెళ్ళాం ఆ మొగుడ్ని రెండు మొట్టికాయలు మొట్టయినా దార్లో పెట్టుకోవచ్చు."

"లలిత చెప్పింది నిజం సింహాద్రీ. నేను ఏడోతరగతి రెండోసారి చదువుతుండగా లెక్కల్లో సున్నామార్కులొచ్చాయని లెక్కల పంతులమ్మ నా నెత్తిమీద మొట్టినచోటే పదే పదే గట్టిగా మొట్టింది. దాంతో అక్కడ అంగుళంఎత్తున బొప్పెకట్టేసింది. మా నానమ్మ అది చూసి పంతులమ్మమీద కాళికావతారం ఎత్తింది. 'మొగవెధవల్ని ఇలా మొట్టినచోటే మొడితే మెదడు పాడైపోయి రేపెందుకైనా పనికొస్తారటే? బుర్ర నాలుగువైపులా సమానంగా మొట్టుకోవాలిగానీ ఇలా ఒకవైపే మొట్టుకుంటారా తెలివితక్కువదానా!' అని కోప్పడేసింది. ఆ పంతులమ్మ ఆనందంతో నానమ్మ కాళ్ళమీదపడిపోయింది. అప్పటినుండీ మొట్టికాయల్తో నా బుర్ర తాబేటిడిప్పలా గట్టిపడిపోయింది. ఎప్పుడైనా లలిత నన్ను మొట్టినా పాపం ఆవిడవేళ్ళే నెప్పెడతాయి" టీ ఇస్తూ చెప్పాడు రాంబాబు.

సింహాద్రి రాంబాబువంక గుర్రుగా చూశాడు.

"మీలాంటివాళ్ళు పిల్లల్ని కనకుండా వుండటం మంచిది లలితగారూ. ఇటువంటి కాపురాలు ఎన్నాళ్ళు నిలుస్తాయో తెలీదుగా!" వెటకరించాడు సింహాద్రి.

"ఆడబతుక్కి పిల్లల్ని కనడమే జన్మచరితార్థంగా భావించే ఆడదాన్నికాదులేవోయ్ సింహం" చెప్పింది లలిత.

"అనుకున్నాలెండి అటువంటివారేనని! ఇపుడు వాదించడానికి టైంలేదు. మీ ఇద్దరూ పెళ్ళికి తప్పకుండా రావాలి. విడిదిలో మీకు వేరేరూం ఏర్పాటుచేయిస్తాలెండి."

"నిస్సిగ్గుగా కట్నాలు ఇచ్చిపుచ్చుకునే ఛండాలపు పెళ్ళిళ్ళకి మేం రావని తెల్సీ ఎందుకు పిలుస్తావ్ సింహం! అయినా ఈ అర్థరాత్రి ముహూర్తాలేవిటి పిశాచాల డాన్స్‌లాగ. బాజాలమోతలో ఇరుగుపొరుగుల నిద్ర చెడగొట్టడం, వందలకొద్దీ లైట్లు వెలిగించి కరెంట్ దుర్వినియోగం చెయ్యడం బొత్తిగా సివిక్‌సెన్స్ లేకుండా! పెళ్ళి చక్కగా పొద్దుటో, సాయంత్రమో చేసుకోవాలి. నేనే డిక్టేటర్‌నైతే అరుస్తూ అర్ధరాత్రిళ్ళు పెళ్ళిళ్ళు చేసుకునేవాళ్ళని అర్జెల్లు జైల్లో పెట్టిస్తాను - నివ్వయినా సరే సింహం."

"పాపం. సింహాద్రికి మినహాయింపు ఇచ్చెయ్ లలితా. జైల్లో వుంటే ఆదివారం పొద్దుట మనింటికెలా రాగలడు?" రాంబాబు లలితను రిక్వెస్టు చేశాడు.

"అసలు మీలాటివాళ్ళని పెళ్ళిళ్ళకి, పేరంటాలకీ ఎవరు పిలుస్తారండీ లలితగారూ? నేనుకాబట్టి స్నేహంకొద్దీ పిలుస్తున్నానంతే. మీరు పెళ్ళికి వస్తున్నారు ... అంతే" సింహాద్రి లేచాడు.

x x x "... రాదే చెలీ ... నమ్మరాదే చెలీ!

పోతులనూ ... ఈ దున్నపోతులనూ ... నమ్మరాదే చెలీ!" సానుభూతిపరుడింట్లో రహస్యంగా దాక్కున్న వంటరి నక్సలైట్‌ని జిల్లా పోలీసుయంత్రాంగమంతా చుట్టిముట్టి పోలీసోచితంగా పొగబెట్టి ఎన్‌కౌంటర్ చేసి ఇంటి యజమానురాలితో సహా స్వర్గానికి పంపినట్టు - అక్కడక్కడా దాక్కున్న వెండివెం

మిగతా 13 వ పేజీలో..

161

మనసు వైద్యం

కొంచెం నిజం కొంచెం కల్పన



"శైలూ! నువ్వంటే నాకు పంచ ప్రాణాలు. నువ్వు లేకుండా క్షణం కూడా వుండలేను. అసలు ఈ జీవితానికి అర్థం, పరమార్థం నువ్వే... అంటూ ఏవేవో చెప్తూ వుంటే అవన్నీ సినిమా డైలాగులని అర్థం చేసుకోలేకపోయాను పిచ్చిమొహాన్ని... సంవత్సరం గడిచాక గానీ అతగాడి అసలు స్వరూపం అర్థం కాలేదు. అయినా ఇంకా మారతారేమోనని మరో సంవత్సరం ఎదురు చూశా. ప్చ్! అతడు మారడు." ఉక్రోషం, దుఃఖం, కోపం మిళితమైన స్వరంతో పలికింది శైలజ.

"అంటే మీ వారికి మీ మీద అస్సలు ప్రేమే లేదనా మీ అభిప్రాయం?" సూటిగా చూస్తూ అడిగాను.

"అభిప్రాయం ఏమిటి? గట్టి నమ్మకం" అంది.

"ఆయనతో రెండేళ్ళు మాత్రమే కాపురం చేసినా వందేళ్ళు చేసినంతగా అనిపించింది. నిస్సారమైన సంసారంలో నేనొక వేదాంతిని అయ్యాను. ఆయనకు మనసన్నది లేదు. ఒక మరబొమ్మ. భర్త అంటే డబ్బు సంపాదించే మర మనిషి. మరబొమ్మలకు ప్రేమాభిమానం గురించి ఎలా తెలియదో ఆయనా అంతే! ఎంతసేపూ ఆఫీసు గొడవే! భార్య ముద్దు ముచ్చట తీర్చాలన్న ధ్యాసే వుండదు."

"ఆ విషయం మీరు ఐమీన్ మీ అసంతృప్తిని ఆయనతో చర్చించారా?"

"ఎన్నోసార్లు. ఇదంతా నీ కోసమేగా శైలూ?" అనేవారు. "సిగ్గువిడిచి చెబుతున్నా. సంసారంలో ఏ పనికైనా నేనే ఉపక్రమించాలి. అతగాడు నిమిత్తమాత్రుడిలా వుండేవారు. అలాంటి వాడితో ఏ ఆడదైనా ఎంతకాలం అని కాపురం చేస్తుంది చెప్పండి?"

శైలజ కళ్ళ నుంచి జలజల కన్నీళ్ళు రాలాయి. ఇక దుఃఖం దాచుకోలేనట్టు ముఖం రెండు చేతుల్లోనూ దాచుకుని వెక్కివెక్కి ఏడవసాగింది. నేను ఆమెను వారించే ప్రయత్నం చెయ్యలేదు.

శైలజ తెలివైనదే! అయితే భర్త నిర్లక్ష్యం చేస్తున్నాడనే భావం ఆమెలో పెనవేసుకుని పోయింది. పెళ్ళైన కొత్తలో తనచుట్టూ తిరుగుతూ తనతోటే ప్రపంచం అన్న మనిషి ఇప్పుడు ఆఫీసునే ప్రపంచంగా ఎందుకు చేసుకున్నాడో ఆమెకు అర్థం కాలేదు. అనేక విధాలుగా ఆరాలు తీసింది. చివరికి అతడికి ఎవరితోనో సంబంధం వుండి వుంటుందనే నిర్ణయానికి వచ్చింది. అతడితో గొడవపడి ఇంటి నుంచి వెళ్ళిపోయింది. శైలజ కూడా ఉద్యోగస్తురాలే! ఆమె నిర్లక్ష్యాన్ని తట్టుకోలేని ఆమె భర్త ముకుందరావు ఆమె ఆఫీసుకు వెళ్ళి ఏదో చెప్పబోతే ఇంకేం చెప్పొద్దు అంటూ ఈసడించుకుని అతణ్ణి ఇంకెప్పుడు ఆఫీసుకు రావద్దని వార్నింగ్ ఇచ్చిందట. ఈ తిరస్కారానికి బెంబేలెత్తిపోయాడు ముకుందరావు. శైలజ పుట్టింటికి వెళ్ళి ఏదో చెప్పబోతే వాళ్ళు వినిపించుకోలేదట.

"నా కూతుర్ని ఇలాగైనా బ్రతకనివ్వు" అంటూ మామగారు చేతులు జోడించి నమస్కరించేసరికి తల్లడిల్లిపోయాడు ముకుందరావు.

ఆ మరుసటి రోజే ముకుందరావు కళ్ళ నీళ్ళ పర్యంతమవుతూ వచ్చి తన గోడు వెళ్ళబోసుకున్నాడు. ఆ తరువాత శైలజకి కబురు చేశాను. ఆమె వచ్చింది. ఆమె మాటలు విన్న తరువాత గానీ అసలు సంగతి అర్థం కాలేదు.

నిజానికి ఒకరంటే ఒకరికి ఎంతో ప్రేమ. భార్య సంతోషమే తన సంతోషం అని, ఆమె తనని మరింత ప్రేమించాలని, ఎప్పుడు ఆమెకు అసౌకర్యం కలగకూడదని ముకుందరావు ఆరాటం.

శైలజకు భర్తే ప్రపంచం. ఆమె ఆఫీసులో వున్నా పార్టీలకు, ఫంక్షన్లకు వెళ్ళినా, షాపింగ్‌కి వెళ్ళినా భర్తతో అక్కడి విషయాన్ని జోడించి ఆలోచించేది. షాపింగ్‌కి వెళ్ళినప్పుడు అక్కడి సూట్స్, టీషర్ట్స్ చూసి ఈ దుస్తుల్లో తన భర్త ఎలా వుంటాడో అని ఊహించుకునేది.

ముకుందరావు ఈ ధోరణికి పూర్తిగా విరుద్ధం. పెళ్ళయిన ఏడు నెలలకు అతడికి ప్రమోషన్ వచ్చింది. అది భార్య అదృష్టమే అనుకున్నాడు. ఏడు నెలల పైగానే ప్రణయ సామ్రాజ్యంలో విహరించిన అతడికి ఆ ప్రణయం పది కాలాలు పదిలంగా వుండాలని, తమకు పుట్టబోయే బిడ్డలు గానీ, భార్య గానీ ఎప్పుడూ ఏవిధమైన ఇబ్బందులకూ లోను కాకుండా వుండాలని, అలా వుండాలంటే ఇంకా కష్టపడి పనిచేసి ఆర్థిక స్తోమత పెంచుకోవాలనే ఆలోచన వచ్చింది. అంతే ఆ ఆలోచనే ముకుందరావు జీవితాన్ని మార్చి వేసింది. అహరహం ఆఫీసులో శ్రమించేవాడు.

ఇలా ఇద్దరికీ ఒకరి పట్ల ఒకరికి అచంచలమైన ప్రేమాభిమానాలు వున్నా వ్యక్తీకరణలో తేడాలు వుండడం వల్ల తేడా వచ్చింది.

తను ఎలా వున్నా తన భార్య తన గురించి అర్థం చేసుకోగలదనే విశ్వాసం ముకుందరావుది. భర్త ప్రేమకోసం తనెంత తాపత్రయ పడుతున్నా అతడిలో చలనం లేదే అనే బాధ శైలజది.

ఆ బాధ దిగమింగుకోలేక ఒకరోజు అతడితో పోట్లాడి పుట్టింటికి వెళ్ళిపోయింది. విడాకులు తప్ప గత్యంతరం లేదని అతడిని హెచ్చరించేసరికి విస్తుపోయాడు. అప్పుడు గానీ అతగాడు చేసిన తప్పేమిటో తెలిసిరాలేదు.

* * *

"శైలజగారూ ఇవి ఒకసారి చూస్తారా?" అన్నాను. కొన్ని బాండ్స్, బ్యాంక్ పాస్‌బుక్స్ ముందుకు తోస్తూ.

ఏవిటివి? అన్నట్టు ప్రశ్నార్థకంగా చూస్తూ అందుకుంది. అప్పటివరకూ ఏడ్చిన ఆమె కళ్ళు విప్పారాయి. ముక్కు మరింత ఎర్రబడింది.

> "ఆయనతో రెండేళ్ళు మాత్రమే కాపురం చేసినా వందేళ్ళు చేసినంతగా అనిపించింది. నిస్సారమైన సంసారంలో నేనొక వేదాంతినయ్యాను. ఆయనకు మనస్సన్నది లేదు. భర్త అంటే డబ్బు సంపాదించేమర మనిషి. మరబొమ్మలకు ప్రేమాభిమానం గురించి ఎలా తెలియదో ఆయనా అంతే"!

అదురుతున్న పెదవులతో, వణకుతున్న చేతులతో జారిపోతున్న పాస్‌బుక్స్ గట్టిగా పట్టుకుని పేజీలు తిప్పింది.

"ఇంత డబ్బు...?" నూతిలోంచి వచ్చినట్టుగా వున్నాయి ఆమె మాటలు...

సమాధానంగా చిరునవ్వు నవ్వాను.

మిగతా పేపర్లు గబగబా తిరగేసింది... "ఇవన్నీ..."

"ఆ డబ్బంతా మీదే... ఐ మీన్ మీ వారు మీకోసం, మీకు పుట్టబోయే బిడ్డల కోసం దాచారు. మీ కుటుంబం ఎలాంటి ఆర్థిక ఇబ్బందులకు లోనుకాకూడదని, ముఖ్యంగా మీకు ఏ లోటు జరగకూడదని ఆయన అహోరాత్రులు శ్రమించి మీ కోసం కూడబెట్టిన సొమ్ము అది" తాపీగా చెప్పాను.

డాక్టర్... అంటూ మళ్ళీ దుఃఖించింది.

"ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్ శైలజగారు" అంటూ బజర్ నొక్కాను.

"ముకుందరావు గారిని లోపలికి రమ్మను" అని చెప్పాను మా అసిస్టెంట్‌కి.

ఆ మాటకు ఉలిక్కిపడింది శైలజ.

ముకుందరావు కూడా వచ్చారనే సంగతి ఆమెకు తెలీదు. ఆయన లోపలకు వస్తూంటే అప్రయత్నంగా లేచి నిలుచుంది.

ముకుందరావు కూడా స్పందిస్తూ 'కూర్చో శైలూ' అంటూ ఆమె భుజాల్ని పట్టుకుని కూర్చోబెట్టాడు. కావాలనే రెండు నిమిషాలు నిశ్శబ్దంగా వున్నాను. ఇద్దరి వంకా చూస్తూ అన్నాను.

"చూడండి! మీదొక విచిత్రమైన పరిస్థితి. రెండేళ్ళు కాపురం చేసినా ఇద్దరి మధ్యా అండర్ స్టాండింగ్ లేదు. ఇద్దరికీ ఒకరిమీద ఒకరికి అంతులేని అనురాగం వుంది. కానీ ఏం ప్రయోజనం, అవగాహన లేదు. మీరు మీ సజెస్టబిలిటీలో వున్న పరిస్థితిని మార్పు చేసుకోవాలి. సజెస్టబిలిటీ అంటే సూచనీయత. సెల్ఫ్ హిప్నాసిస్‌లో ముఖ్యమైన రెండవ అంశం సజెస్టబిలిటీ. బిహేవియర్ థెరపీ మీ ఇద్దరికీ అవసరమే!" అని చెప్పాను.

"ముకుందరావు గారు లైఫ్‌లో ఎంజాయ్‌మెంట్ అనేది కేవలం డబ్బుతోనే రాదు. మీ లైఫ్‌లో కొంత ఎంటర్‌టైన్‌మెంట్ అవసరం. మీరు కొంత ఫాంటసీలలో తేలియాడాలి. ఇలా ఇద్దరూ మీ సజెస్టబిలిటీస్‌ని బేలన్స్ చేసుకుంటే ఏ ఇబ్బందీ వుండదు" అని చెప్పాను.

ఆ తరువాత వారి అన్యోన్య దాంపత్య ఫలంగా ఏడాది తిరిగేసరికి పండంటి బిడ్డకు తల్లిదండ్రుల య్యారు.

–డా. వి. నగేష్
హిప్నటిస్ట్
208 సెకండ్ ఫ్లోర్, కరన్ సెంటర్
పార్క్‌లేన్ చౌరస్తా వద్ద, సికిందరాబాద్-3

ఇల్లీగల్

కథ 12వ పేజీ తరువాయి

ముకల్ని అద్దంలో చూస్తూ ఎన్‌కౌంటర్ చేస్తూ కూనిరాగాలు తీస్తోంది లలిత ఆదివారం ఉదయం.

లలితకిష్టమైన బెండకాయవేపుడు వేయిస్తున్న రాంబాబుకి గొప్ప అనుమానం వేసింది. ఆ పాట తనను ఉద్దేశించి పాడుతున్నదేనా? తన గురించే అయితే తనన్సలూరుకోడు. అనుమానం తీర్చేసుకోవాల్సిందే. వేపుడుని అలాగే వదిలేసి అట్లకాడ చేతబట్టి లలితముందు కోపంగా నిలబడ్డాడు.

"ఏయ్ లల్లీ! నిన్నే ... నన్నేనా దున్నపోతంటున్నావ్?"

లలిత రాంబాబుకేసి ఓసారి సీరియస్‌గా చూసి ఫక్కున నవ్వేసింది.

"ఛా! నువ్వెందుకు దున్నపోతువ్వుతావు రాంబాబూ. దున్నపోతులతో సమానమవడానికి మీ జాతికి ఇంకా ఓ పదివేల సంవత్సరాలైనా పడుతుంది" చెప్పింది లలిత.

విక్రమార్కుడి సరైన సమాధానంతో తృప్తిచెంది తిరిగి చెట్టెక్కిన బేతాళుడులా రాంబాబు లలిత జవాబుకి తృప్తిపడి అట్లకాడతో కిచెన్లోకెళ్ళిపోయాడు.

సింహాద్రి పెళ్ళికి మేంరాంగాకరామని లలిత నిష్కర్షగా చెప్పేయడం రాంబాబుకి నచ్చలేదు.

"కట్నాలిచ్చిపుచ్చుకునే పెళ్ళిళ్ళకి వెళ్ళకూడదని నియమం పెట్టుకుంటే మనం ఈ దేశంలో ఒక్క పెళ్ళిక్కూడా వెళ్ళలేం లల్లీ. ప్లీజ్ రూల్స్ కొంచెం సడలించు లల్లీ! పెళ్ళిళ్ళల్లో తలంబ్రాలు పోసుకునే సీను ఎంత బావుంటుందనుకున్నావ్! పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ ముసిముసినవ్వులు నవ్వుకుంటూ పోటాపోటీలమీద బియ్యపళ్ళాలెత్తి నెత్తిన పోసుకోవడం ఎంత సరదాగా వుంటుందనుకున్నావ్ భలే!" పులకించిపోతూ అన్నాడు రాంబాబు.

"సరదాయా–పాడా? చారెడు గంజి కాచుకోడానికి గుప్పెడు నూకలకి గతిలేక లక్షలాది దౌర్భాగ్యులు ఏడ్చే సమాజంలో సరదాలూ, సంప్రదాయాల పేరుమీద పళ్ళాల్తో బియ్యం నెత్తిన దిమ్మరించుకుని ఆనందించడం వాళ్ళ వికృత మనస్తత్వాలకి చిహ్నం అని తోచడంలేదా రాంబాబు?" మొట్టి చెప్పింది లలిత.

తల తడుముకుంటూ తెల్లబోయాడు రాంబాబు. "నిజమే లల్లీ! నేను అలా ఆలోచించలేకపోయానుస్మీ! ఎంతైనా పెద్దదానివి కాబట్టి బాగా ఆలోచిస్తావ్!" మెచ్చుకున్నాడు రాంబాబు.

తాము సింహాద్రి పెళ్ళికి వెళ్ళకపోయినా సింహాద్రి ఎంతో అట్టహాసంగా జరిగిన తన పెళ్ళి వీడియోకేసెట్ తీసుకొచ్చి లలితనీ, తననీ బలవంతంగా కూర్చోబెట్టి చూపించాడు. పెళ్ళికూతురు జయలక్ష్మి సలక్షణంగా చాలా చురుగ్గా వుంది.

తర్వాత సింహాద్రి బిజినెస్‌లోపడి రావడమే బాగా తగ్గించేశాడు. చివరిసారిగా కనిపించి సంవత్సరం దాటిందేమో.

"తరచుగా వచ్చే సింహాద్రి అసలు రాకపోవడం ఏదో వెలితిగాలేదూ లల్లీ? ఏమైపోయాడో?" ఓ ఆదివారం ఉదయం లలితని అడిగాడు రాంబాబు.

"సింహాద్రి ఇక మనింటికి రాడు ... రాలేదు" చెప్పింది లలిత.

"ఏం? ఎందుకురాడు? నీకెలా తెలుసు?"

"సింహాద్రి లీగల్‌కేసులో ఇరుక్కున్నాడు."

"లీగల్‌కేసా? సింహాద్రి ఇల్లీగల్ పనులు చేసేరకంకాదే!" ఆశ్చర్యపోతూ అడిగాడు రాంబాబు.

"జయలక్ష్మి రెండేళ్ళ కూతురుతో పుట్టింటికిపోయి సింహాద్రికి విడాకుల నోటీసు పంపిందట" చెప్పింది లలిత.

రాంబాబు దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు కాసేపు ఏమీ మాట్లాడలేదు.

"వెనుకటికాలం కవులు మొగాడిని వృక్షంతోనూ, ఆడదాన్ని ఆ వృక్షాన్ని ఆధారంచేసుకుని పైకెగబాకే బలహీనమైన లతతోనూ పోల్చారు లల్లీ. కానీ నాకేమనిపిస్తోందంటే తలకిందులుగా వేలాడే గబ్బిలానికి లోకమంతా తలకిందులుగా కనిపించినట్టు వాళ్ళు నిజాన్ని తలకిందులుగా చెప్పారని. ఆడదే వటవృక్షం లల్లీ. ఆ మహావృక్షం నీడలో సేదతీర్చుకునే ఓ గడ్డిమొక్క మొగాడు. తనే ఆ వృక్షానికి నీడనిస్తున్నానని భావించే గడ్డిమొక్క!"

"ఫర్వాలేదే, నీ తాబేటి డిప్పకాయలోకూడా ఆలోచన నవ్యంగానే ఎదుగుతోందే!" నవ్వి సుతారంగా ఓ మొట్టికాయమొట్టి రాంబాబుని దగ్గరకు లాక్కుంది లలిత.

"ఇందాక మొట్టినచోటే తిరిగి మొదుతున్నావ్!" ముద్దుగా కోపడ్డాడు రాంబాబు. ■

వచ్చేవారం కథ

గొర్రె చచ్చింది

–గాజుల ఉమామహేశ్వర్

ఇలా చేస్తే సరి

- భోజనం తరువాత యాపిల్ ముక్క తింటే పళ్లల్లో చిక్కుకున్న ఆహార పదార్థాలు వచ్చేస్తాయి. పళ్లు ఆరోగ్యంగా వుంటాయి.

- కోడిగుడ్డు తలకు రాసుకునేవారు వాసన రాకుండా వుండాలంటే అందులో సువాసన ద్రవ్యాలు కలుపుకోవచ్చు.

- తులసి రసాన్ని ప్రతిరోజు పరగడుపున సేవిస్తే చర్మరోగాలు తగ్గిపోతాయి.

- పెనంమీద జిడ్డు బాగా వుంటే ఉప్పచల్లి న్యూస్ పేపర్‌తో తుడిచి తరువాత తోమాలి.

ఎన్. శివానంద్